www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 6 ఏప్రిల్ 2023

5

ఏలూరు



'జగనన్నే మా భవిష్యత్తు'ను విజయవంతం చేయాలి

ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు

ప్రజాశక్తి - ఏలూరు

'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు కోరారు. బుధవారం సాయంత్రం గుండుగొలనులో కోరుకొల్లు, గుండుగొలను గ్రామ పంచాయతీలకు చెందిన 311 స్వయం సహాయక సంఘాల సభ్యులకు మూడో విడత ఆసరాగా మంజూరైన రూ.2.70 కోట్ల చెక్కును లబ్ధిదారులకు ఎంఎల్ఎ అందజేశారు. ఈ కార్యక్రమంలో భీమడోలు ఎంపిపి కె.రామయ్య, ఎఎంసి ఛైర్‌పర్సన్ ఇజ్జెటి నీలిమ గుండుగొలను గ్రామ ఉపసర్పంచి ముదుండి సూర్యనారాయణరాజు, భీమడోలు సొసైటీ అధ్యక్షులు ఆర్.సత్య శ్రీనివాస్, పార్టీ నేత రామకుర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొంతమందికే ఆసరా..!



స్వయం సహాయక సంఘాలకు మాన్యువల్ చెక్కును అందిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి (ఫైల్‌ఫోటో)

మిగిలినవారికి తప్పని నిరీక్షణ

గత నెల 25న బటన్ నొక్కి ఆసరాను ప్రారంభించిన సిఎం జగన్

10 రోజులు గడిచినా ఖాతాల్లో జామకాని సొమ్ము

గత నెల 25న ఏలూరు జిల్లా దెందులూరులో వైఎస్ఆర్ ఆసరా మూడో విడత కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్ బటన్ నొక్కి ప్రారంభించారు. స్వయం సహాయక సంఘాల బ్యాంక్ ఖాతాల్లో ఆసరా రుణమాఫీ సొమ్మును జమ చేయడం ప్రారంభించారు. అయితే ఇది జరిగి పది రోజులు గడుస్తున్నా జిల్లాలో పూర్తిస్థాయిలో స్వయం సహాయక సంఘాలకు సొమ్ము జమ కాలేదు. దీనికి అధికారులు సవాలక్ష కారణాలు చెబుతున్నారు. కొంతమందికే ఆసరా లబ్ధి చేకూరడంతో మిగిలిన సంఘాలు నిరీక్షిస్తున్నాయి.

ప్రజాశక్తి - భీమవరం

గత టిడిపి ప్రభుత్వ హయాంలో స్వయంసహాయక సంఘాలు తీసుకున్న రుణాలను మాఫీ చేస్తానని, అదీ నాలుగు విడతల్లో మాఫీ చేస్తానని జగన్ పాదయాత్రలో మహిళలకు హామీ ఇచ్చారు. నవరత్నాల్లో భాగంగా ప్రతి మహిళా అధిక అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో ఆసరా కార్యక్రమానికి వైసిపి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా గత నెల 25న మూడో విడత ఆసరా రుణమాఫీ సొమ్మును ముఖ్యమంత్రి జగన్ స్వయం సహాయక సంఘాల్లో జమ చేసే ప్రక్రియను ప్రారంభించారు. ఆసరా మూడో విడతలో జిల్లాలో 25,878 స్వయం సహాయక సంఘాలకు చెందిన 2,56,389 మంది సభ్యులకు రూ.266.67 కోట్లు లబ్ధి చేకూరనుంది. దీనికి సంబంధించిన మాన్యువల్ చెక్కును గత నెల 25న కలెక్టరేట్లో జిల్లాస్థాయి ఆసరా కార్యక్రమంలో కలెక్టర్ పి.ప్రశాంతి స్వయం సహాయక సంఘాలకు అందించారు. అయితే రుణమాఫీ సొమ్ము ఇంకా పూర్తిగా సంఘాలన్నింటికీ పూర్తిస్థాయిలో అందలేదు. ముఖ్యమంత్రి బటన్ నొక్కి నిధులు విడుదల చేసి పది రోజులు గడిచినా లబ్దిదారుల ఖాతాలకు నగదు జమ కాలేదు. ఎక్కడికక్కడ ప్రజాప్రతినిధులు, అధికారులు ఆర్భాటంగా సంబరాలు జరిపి నమూనా చెక్కులు అందజేస్తూ ప్రచారం చేస్తున్నారే తప్ప సొమ్ము మాత్రం బ్యాంకు ఖాతాల్లో పడటం లేదని పలు సంఘాల మహిళలు పెదవివిరుస్తున్నారు. అయితే సంఘాల బ్యాంకు ఖాతాలకు నగదు జమైనట్లు అధికారులు చెబుతున్నారు.

ప్రతి మండలంలో ఆసరా సంబరాలు

ప్రతి మండలంలో ఆసరా సంబరాలను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. లబ్ధి పొందిన ప్రతి మహిళా ఇంటికి స్టిక్కర్ అంటించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో దీనికి సంబంధించి ప్రచార స్టిక్కర్లు, కరపత్రాలు సిద్ధం చేసి మండల మహిళా సమాఖ్య కార్యాలయాలకు, అక్కడి నుంచి ఆయా గ్రామాలు, వార్డులు, డివిజన్లకు సరఫరా చేశారు. గత నెల 25 నుంచి ఈ నెల 4 వరకు అన్ని మండలాల్లో ఆసరా సంబరాలు నిర్వహించారు. ఆసరా సంబరాలు పూర్తయిన తర్వాత ఆయా సంఘాల ఖాతాలకు నగదు జమవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇదిలాఉంటే సంబరాలు పూర్తయిన చోట కూడా ఇంకా ఆయా సంఘాల ఖాతాలకు ఆసరా సొమ్ము జమకాలేదని పలువురు మహిళలు చెబుతున్నారు. ఉండి నియోజకవర్గంలోని పాలకోడేరు కాళ్ల, ఆకివీడు, ఉండి మండలాల్లో ఒక సంఘానికి కూడా రుణమాఫీ సొమ్ము జమ కాలేదు. జిల్లావ్యాప్తంగా అనేక సంఘాలకు రుణమాఫీ నగదు జమ కాలేదని తెలిసింది. అయితే ఎన్ని సంఘాలకు నగదు జమ అయింది... ఇంకా ఎన్నింటికి జమకావాల్సి ఉందని కూడా అధికారులు స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. వరుసగా ప్రభుత్వ సెలవులు, బ్యాంకు సెలవులు రావడం వల్ల చాలా మండలాల్లోని ఖాతాల్లో నగదు జమ కాలేదని, ఈ నెల 10లోగా అన్ని సంఘాలకు దశల వారీగా మూడో విడత నగదు జమవుతుందని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో ఆసరా మూడు విడతల్లో రూ.800.56 కోట్లు లబ్ధి

జిల్లాలో స్వయం సహాయక సంఘాలకు అసరా రుణమాఫీ లబ్ధి మూడు విడతల్లో రూ.800.56 కోట్లు జరిగింది. మొదటి విడతలో 25,883 సంఘాలకు చెందిన 2,58,830 మంది సభ్యులకు రూ.266.71 కోట్లు, రెండో విడతలో 25,899 సంఘాలకు చెందిన 2,58,990 మంది సభ్యులకు రూ.267.18 కోట్లు లబ్ధి చేకూర్చిందన్నారు. మూడో విడతలో ఆచంట నియోజకవర్గంలో 4875 సంఘాలకు చెందిన 48,591 మహిళలకు రూ.49.10 కోట్లు, భీమవరం నియోజకవర్గంలో 2924 సంఘాలకు చెందిన 28,985 మహిళలకు రూ.28.94 కోట్లు, నరసాపురం నియోజకవర్గంలో 3243 సంఘాలకు చెందిన 31,408 మహిళలకు రూ.33.92 కోట్లు, పాలకొల్లు నియోజకవర్గంలో 2662 సంఘాలకు చెందిన 26,965 మంది మహిళలకు రూ.26.45 కోట్లు, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో 2897 సంఘాలకు చెందిన 28,483 మంది సభ్యులకు రూ.25.18 కోట్లు, తణుకు నియోజకవర్గంలో 4142 స్వయం సహాయక సంఘాలకు చెందిన 40,137 మంది సభ్యులకు రూ.41.42 కోట్లు, ఉండి నియోజకవర్గానికి సంబంధించి 5232 సంఘాలకు సంబంధించి 51880 సభ్యులకు రూ.62.63 కోట్లు మొత్తం జిల్లాలో 25,878 సంఘాలకు చెందిన 2,56,389 మంది సభ్యులకు రూ.266.67 కోట్లు లబ్ధి చేకూరింది.



ఢిల్లీలో నినదిస్తున్న వ్యకాస, సిఐటియు నేతలు

ఢిల్లీలో జిల్లా వాసుల గర్జన



ఢిల్లీలో నినదిస్తున్న రైతు నేతలు

ప్రజాశక్తి - భీమవరం/ ఏలూరు

కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి కార్మిక, కర్షక, ప్రజాసంఘాల నేతలు తరలి వెళ్లారు. మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీలో భాగంగా ఢిల్లీలో బుధవారం రాంలీలా మైదానంలో జరిగిన సభలో సిఐటియు పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ, రైతుసంఘం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం, ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు, ఆయా సంఘాల నేతలు కట్రెడ్డి రామకృష్ణ, గొర్ల రామకృష్ణ, జె.వెంకటలక్ష్మి, పి.పద్మ, ఎస్.అసిరియ్య, నరాలశెట్టి రామకృష్ణ, బి.సూర్యచంద్రరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమంలో జిల్లా నుంచి వందలాది మంది పాల్గొన్నారన్నారు. తొలిసారిగా నాలుగు సంఘాల ఆధ్వర్యంలో మోడీ విధానాలను వ్యతిరేకిస్తూ తలపెట్టిన ర్యాలీ విజయవంతమైందన్నారు. రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన తేలుకుట్టిన దొంగల్లా మౌనంగా ఉండటం విచిత్రంగా ఉందన్నారు.

ఏలూరు జిల్లా నుండి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో నేతలు నినదించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు నష్టదాయకంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. ఇప్పటికైనా మద్దతు ధరల గ్యారంటీ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యుత్ సవరణ బిల్లు నుండి వ్యవసాయాన్ని మినహాయిస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోవడం దారుణమన్నారు. అన్నదాతలకు పంట రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ, జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, నేతలు అనుమోలు మురళీ, కొల్లి విజయభాస్కర రెడ్డి, పల్లపోతు రెడ్డియ్య, ఆవాల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మద్దతుగా ధర్నా

కొయ్యలగూడెం: ఢిల్లీలో జరుగుతున్న కార్మిక, కర్షక్ ప్రదర్శనకు సంఘీభావంగా సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్.శివకుమార్, సిహెచ్.మరిడియ్య, పిల్లా తమ్మారావు, రాచూరి నాగేశ్వరరావు, బొబ్బర సురేష్, రాచూరు దుర్గారావు, ఉద్దండం గోపీ, ఇ.మహేష్, కె.ఆసిన్, సిహెచ్.రాజేష్, ఎం.దుర్గారావు, మౌలాలీ, తదితరులు పాల్గొన్నారు.

జగజ్జీవన్‌రామ్ జీవితం యువతకు ఆదర్శనీయం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఏలూరు

డాక్టర్ బాబూ జగజ్జీవన్‌రామ్ జీవితం నేటి యువతకు ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. బాబూజగజ్జీవన్‌రామ్ 115వ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్‌లోని బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి ఏలూరు ఎంఎల్ఎ ఆళ్ల నానితో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించి ఉన్నత విద్య ద్వారా అత్యున్నత స్థాయికి చేరిన బాబూజగజ్జీవన్‌రామ్ జీవితం ఈనాటి తరానికి ఆదర్శనీయమన్నారు. ఉప ప్రధాని వంటి ఎన్నో అత్యున్నత పదవులు అలంకరించి బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ఎంతో సేవ చేయడం ద్వారా ఆ పదవులకు వన్నె తెచ్చారన్నారు. ఏలూర ఎంఎల్ఎ ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) మాట్లాడుతూ నిమ్నతరగతుల అభ్యున్నతికి కృషి చేసిన డాక్టర్ బాబూజగజ్జీవన్‌రామ్ బాటలో నడవడమే వారికి మనమిచ్చే నిజమైన నివాళి అని అన్నారు. షెడ్యూల్డ్ కులాల సంక్షేమం కోసం వారి విద్య, ఆర్థిక, సామాజిక, రాజకీయంగా అభివృద్ధికి ముఖ్యమంత్రి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. షెడ్యూల్డ్ కులాల జీవన ప్రమాణాల స్థాయిని పెంచేందుకు విద్య, స్వయంఉపాధి, ఉద్యోగ అవకాశాలతోపాటు రాజకీయంగా కూడా వారికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. డిఆర్ఒ ఎవిఎన్ఎస్.మూర్తి, ఆర్‌డిఒ పెంచల్‌కిషోర్, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదనరావు, డిప్యూటీ మేయర్ ఎన్.సుధీర్‌బాబు, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, తహశీల్దార్ సోమశేఖర్, వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ నెరుసు చిరంజీవి, కార్పొరేటర్లు సుంకర చంద్రశేఖర్, మునగాల కేదారేశ్వరి నాని, జిజ్జువరపు విజయనిర్మల, యర్రంశెట్టి సుమన్, కత్తిరి రామమోహనరావు, పొలిమేర రాందాస్, జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ కమిటీ సభ్యులు మేతర అజయ్‌బాబు, షెడ్యూల్డ్ కులాల సంఘాల ప్రతినిధులు పొలిమేర హరికృష్ణ, జుజ్జువరపు ప్రతాప్, బయ్యారపు రాజేశ్వరరావు, జుంజు మోజెస్, కందుల రమేష్, చాగంటి సంజీవ్, ప్రముఖులు డాక్టర్ దిరిశాల వరప్రసాద్, బొద్దాని శ్రీనివాస్, మధ్యాహ్నపు బలరాం పాల్గొన్నారు.

సమాజంలో అణగారిన వర్గాలవారి హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన గొప్ప సామాజికవేత్త డాక్టర్ బాబూ జగజ్జీవన్‌రామ్ అని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో బుధవారం జగజ్జీవన్‌రామ్ 115వ జయంతి వేడుక జ్యోతి వెలిగించి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ విద్య ద్వారానే అభివద్ధి సాధ్యమని నమ్మి, ప్రతి పేదవాడు విద్యావంతుడు కావాలని ప్రజల్లో చైతన్యం జగజ్జీవన్‌రామ్ తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ కమిటీ సభ్యులు మేతర అజయ్‌బాబు, పొలిమేర హరికృష్ణ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో డిఆర్ఒ ఎవిఎన్ఎస్.మూర్తి, ఎఎస్‌పి శేఖర్, ఆర్‌డిఒ పెంచల్‌కిషోర్, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదనరావు, తహశీల్దార్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రజారవాణా శాఖలో కారుణ్య నియామకాల ద్వారా నియామకం పొందిన వారికి ఉద్యోగ నియామక పత్రాలను కలెక్టర్ అందజేశారు.

కైకలూరు: మాజీ ఉప ప్రధాని బాబూజగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా బుధవారం ప్రజలు, నాయకులు ఘనంగా నివాళులర్పించారు. జాన్‌పేటలోని ఆయన విగ్రహానికి ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి సభ్యురాలు విజయలక్ష్మి, ఎంపిటిసి బాలమ్మ, కూనవరపు సతీష్, పిల్లనగ్రోవి రఫాయిల్, కుమ్మరిగుంట మదన్, వంగలపూడి విజయకుమార్, భాషా, దండే రవిప్రకాష్, వేల్పూరి చంద్రమోహన్, ఫిర్దోస్‌ఖాన్, మైలు కొండయ్య, కర్రి చంద్రరావు పాల్గొన్నారు.

ఉంగుటూరు: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన డాక్టర్ బాబూ జగజ్జీవన్‌రామ్ ఆదర్శప్రాయుడు అని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు అన్నారు. జగజ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఉంగుటూరు ఎంపిపి గంటా శ్రీలక్ష్మి ఆర్థిక సాయంతో గోపీనాథ్‌పట్నం ఎస్‌సి కాలనీలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆ విగ్రహాన్ని ఎంఎల్ఎ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్, గ్రామ సర్పంచి, మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు పుచ్చకాయల విష్ణుమూర్తి, జెడ్‌పిటిసి కొరిపల్లి జయలక్ష్మి, వైసిపి మండల కన్వీనర్ మరడ మంగారావు, మాజీ ఎఎంసి ఛైర్మన్ రమావతి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉంగుటూరు: జగజ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎంఎల్ఎ వాసుబాబు



నివాళులర్పిస్తున్న సాబ్జీ, ఉపాధ్యాయ నేతలు

జగజ్జీవన్‌రామ్ ఆశయాలు ఆదర్శనీయం

ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు

బాబూజగజ్జీవన్‌రామ్ ఆశయాలు ఆదర్శనీయమని ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అన్నారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్.రవికుమార్ అధ్యక్షతన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం బుధవారం జరిగింది. సమావేశంలో తొలుత జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎంఎల్‌సి సాబ్జీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాబ్జీ మాట్లాడుతూ బాబూజగజ్జీవన్‌రామ్ ఆశయాలు ఆచరణీయమన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగులను నమ్మించి మోసగించిందని, హక్కుల కోసం పోరాటం చేయకపోతే మనమేమీ సాధించుకోలేమని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, జిల్లా ప్రధాన కార్యదర్శి పివి.నరసింహారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పూరేటి శ్రీనివాస్, గౌరవాధ్యక్షులు ఎంవి.శ్యాంబాబు, సహాధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు, కోశాధికారి షేక్ ముస్తఫాఅలీ, పలువురు జిల్లా, మండల నేతలు పాల్గొన్నారు.

షేర్ క్యాపిటల్‌పై వడ్డీ చెల్లించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు

సహకార సంఘాలకు షేర్ క్యాపిటల్‌పై డిసిసిబి నుండి వడ్డీ చెల్లింపు వెంటనే చేయాలని, రైతులకు వెన్నుదన్నుగా ఉన్న సహకార సంఘాలను రక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 258 సహకార సంఘాలున్నాయని, ఈ సంఘాల్లో అప్పు తీసుకున్న రైతుల నుంచి 10 శాతం షేర్ క్యాపిటల్ వసూలు చేస్తారని తెలిపారు. ఈ విధంగా రైతుల నుండి వచ్చిన షేర్ క్యాపిటల్‌ను డిసిసిబికి సహకార సంఘాలు చెల్లిస్తాయని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం షేర్ క్యాపిటల్ సొమ్ముపై డివిడెంట్‌గాని, ఆరు శాతం వడ్డీగాని డిసిసిబి సహకార సంఘాలకు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. 2010-11 నుండి 2021-22 వరకూ షేర్ క్యాపిటల్ కింద సహకార సంఘాల నుంచి డిసిసిబికి వెళ్లిన సొమ్ము దాదాపు రూ.1275 కోట్ల వరకూ ఉందని పేర్కొన్నారు. ఈ సొమ్ముకు ఇప్పటి వరకు లెక్కిస్తే దాదాపు రూ.76 కోట్లు వరకూ వడ్డీ రూపంలో సహకార సంఘాలకు డిసిసిబి నుండి రావాల్సి ఉండగా కేవలం రూ.6 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుందని తెలిపారు. షేర్ క్యాపిటల్‌పై డివిడెంట్‌గాని, వడ్డీగాని రాకపోవడంతో సహకార సంఘాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. సహకార సంఘాలకు డిసిసిబి షేర్ క్యాపిటల్ ఇవ్వాల్సిన వడ్డీ ఇవ్వకపోగా 2010-13 మధ్యకాలంలో సహకార సంఘాల్లోని రైతులకు చెల్లించిన వడ్డీ రాయితీ సొమ్ము ఆరు శాతం తిరిగి డిసిసిబికి ఇవ్వాలంటూ రూ.27.51 కోట్లు సర్దుబాటు లెక్కలు సంఘాల్లో చేయడం ఆశ్చర్యంగా ఉందని పేర్కొన్నారు. డిసిసిబిలో జరిగిన అవినీతిని, తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకే ఈ విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. డిసిసిబికి సహకార సంఘాలు వడ్డీ రాయితీ సొమ్మును చెల్లిస్తే భవిష్యత్తులో అన్ని రకాలుగా ఆడిట్లో ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. ఇటీవల కాలంలో డిసిసిబి అధికారుల నిరంకుశ ధోరణి మరింత పెరిగిందని, అవినీతి పతాకస్థాయికి చేరి అందులో జిల్లా ఉన్నతాధికారులే భాగస్వాములైనందున సహకార సంఘాల మనుగడకు ప్రమాదమని తెలిపారు. ఇప్పటికైనా డిసిసిబి తన వైఖరిని మార్చుకొని సహకారం సంఘాలకు చెల్లించాల్సిన డివిడెంట్ లేదా వడ్డీ సొమ్మును పూర్తిగా చెల్లించాలని కోరారు. డిసిసిబిలో జరిగిన అవినీతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని, కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



రేడియం స్టిక్కర్లతో ఏర్పాటు చేసిన డ్రమ్ములను పరిశీలిస్తున్న అధికారులు

ప్రమాదాల నివారణకు సహకరించాలి

ప్రజాశక్తి - పోలవరం

రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు ప్రతిఒక్కరూ సహకరించాలని పోలవరం సిఐ కె.విజయబాబు కోరారు. పోలవరం డిఎస్‌పి కె.లతాకుమారి ఆదేశాలతో పోలవరం సిఐ విజయబాబు పర్యవేక్షణలో కొత్త పట్టిసీమ సమీపంలో ప్రమాదకర మలుపుల వద్ద రేడియం స్టిక్కరింగ్‌తో కూడిన డ్రమ్ములను బుధవారం ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సిఐ విజయబాబు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నందున, పోలవరం నుండి ఇతర ప్రదేశాలకు రాకపోకలు సాగించే పలు ప్రమాదకర మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నామన్నారు. కొవ్వూరు ఎన్‌హెచ్ 365 రహదారిలో ప్రమాదకర ప్రదేశాల వద్ద మార్కింగ్, సిగ్నల్ బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు వంటివి ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బి ఇఇని కోరనున్నట్లు తెలిపారు. ఎస్ఐ పవన్‌కుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, వేగ నియంత్రణ పాటించాలని, మద్యం మత్తులో వాహనాలను నడపవద్దని సూచించారు.

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే అందించాలి : సిపిఎం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

టిడ్కో లబ్ధిదారులకు ఇళ్లను వెంటనే అందించాలని సిపిఎం డిమాండ్ చేసింది. బుధవారం ఉదయం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో టిడ్కో గృహ సముదాయాలను, జగనన్న కాలనీ నిర్మాణాలను సిపిఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్ మాట్లాడుతూ 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల ముందు హడావిడిగా పేదలకు సొంత ఇల్లు కట్టించి ఇస్తామని, ప్రజల నుండి రూ.50 వేలు, రూ.లక్ష వరకు సొమ్ము కట్టించుకుని టిడ్కో గృహాల నిర్మాణం చేపట్టిందన్నారు. ఈ ఇళ్ల నిర్మాణాల బాధ్యత ఆంధ్రప్రదేశ్ టౌన్‌షిప్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 13 లక్షల మంది, ఏలూరు జిల్లాలో 22 వేల మంది, జంగారెడ్డిగూడెం పట్టణంలోని సుమారు 900 మంది లబ్ధిదారులు ఉన్నారని వివరాలు తెలిపారు. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, దాంతో టిడ్కో ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయిందని అన్నారు. ఎన్నికల ముందు వైసిపి టిడ్కో ఇళ్లకు లబ్ధిదారులు పెట్టిన డబ్బు వెనక్కి తిరిగిచ్చేయడంతోపాటు ఉచితంగానే ఆ ఇళ్లను లబ్ధిదారులు అందిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలవుతున్నా ఇంతవరకు హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. టిడ్కో గృహాలు లబ్ధిదారులకు ఇవ్వకపోవడం వల్ల నిరుపయోగంగా పడి ఉన్నాయన్నారు. టిడ్కో ఇళ్ల లోపల మెటీరియల్ పాడైపోతున్నాయని, గృహ సముదాయం అంతా ముళ్లపొదలు, పిచ్చి మొక్కలతో అటవీ ప్రాంతాన్ని తలపిస్తుందని అన్నారు. లబ్ధిదారులు తమ సొంతింటి కల నెరవేరుతుందని, ప్రజలంతా ఐదు సంవత్సరాల క్రితం రూ.50 వేలు, రూ.లక్ష అప్పు చేసి ప్రభుత్వానికి డబ్బు కట్టారని, నేడు వారికి ఆ సొంతిల్లు కల నెరవేరక, తెచ్చిన డబ్బుకు వడ్డీ కడుతూ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికీ వారంతా నాలుగైదు వేల రూపాయల అద్దె ఇళ్లలో నివశిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే టిడ్కో ఇళ్లు అందించాలని డిమాండ్ చేశారు. జగనన్న కాలనీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం లక్షలాది ఎకరాలు స్థలాలు సేకరించిందన్నారు. ఈ కాలనీల్లో ఇళ్ల నిర్మాణం ఇప్పటి వరకూ పూర్తి కాలేదని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కలిపి కేవలం లబ్ధిదారులకు రూ.1.80 లక్షలు మాత్రమే అందిస్తుందని, అయితే లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి ఆరు నుండి 8 లక్షల రూపాయల వరకూ ఖర్చవుతుందని చెబుతున్నారని గుర్తు చేశారు. కనీసం జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు లక్షలివ్వాలని డిమాండ్ చేశారు. జగనన్న కాలనీల్లో రోడ్లు, తాగునీరు, వీధిలైట్లు సౌకర్యాలను తక్షణమే కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు, నేతలు వి.గోపీ, ఎస్‌కె.మహబూబ్, నారాయణ, యశ్వంత్, మణి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

వైఎస్ఆర్ ఆసరాలో అక్రమ వసూళ్లు : సిపిఎం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లిలో మంగళవారం జరిగిన వైఎస్ఆర్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమానికి మండలంలోని స్వయం సహాయక సంఘాల సిఎల నుంచి నగదు వసూలు చేసి కార్యక్రమాన్ని నిర్వహించడం దారుణమని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు విమర్శించారు. ఈ సందర్భంగా బుధవారం ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 38 సిఎలు పని చేస్తుండగా ఐకెపి సిబ్బంది ఒక్కో సిఎ వద్ద నుంచి రూ.రెండు వేలు వసూలు చేసి వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా దారుణమన్నారు. స్వయం సహాయక సంఘాల సిఎల నుండి డబ్బులు వసూలు చేసిన మండల సమాఖ్య సిబ్బందిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ప్రజా సంఘాల నాయకులు, ఐద్వా మండల కార్యదర్శి నెలబొరి నిర్మల తెలిపారు. ఈ సమావేశంలో మండల నాయకులు నెలబొరి అప్పారావు, చిట్టిబాబు కొండలరావు, సీతారామయ్య, దానియేలు, దుర్గ ఉన్నారు.

వడ్డీ రాయితీని అప్పుగా చూపడం సరికాదు

భీమడోలు : డిసిసిబి ఆమోదం మేరకు సహకార సంఘాలు దీర్ఘకాలిక రుణాలపై అప్పట్లో అమలు చేసిన ఆరు శాతం వడ్డీ రాయితీని అప్పుగా చూపటాన్ని సహకార సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ మేరకు గుండుగొలను విశాల సహకార పరపతి సంఘం ప్రెసిడెంట్ వి.వి.ఎస్.బాపిరెడ్డి సంఘం ద్వారా ఫిర్యాదు చేశారు. తాజాగా ఈ మేరకు రాష్ట్ర సహకార శాఖ మంత్రి కె.గోవర్ధనరెడ్డికి ఇతర బాధ్యులకు లేఖలను రాశారు. ఇదే క్రమంలో జరుగుతున్న అన్యాయం గురించి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని 32 డిసిసిబి శాఖల పరిధిలోని అన్ని సహకార సంఘ అధ్యక్షులకు వివరించారు. దీనిని వ్యతిరేకిస్తూ అర్జీలు సమర్పించాలని కోరారు. వివరాలను గణాంకపూర్వకంగా తెలియజేశారు. అవసరమైతే న్యాయపోరాటానికి సిద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో సదరు సంఘాల వారందరూ ఒక వేదికపై సమావేశమై దీనిపై చర్చించాలని కోరారు.

పేదలకు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - ముసునూరు

పేద మహిళలకు, వృద్ధులకు చొప్పెల్లి దేవసహాయం కుటుంబసభ్యులు దుప్పట్లు పంపిణీ చేశారు. మండలంలోని గోపవరంలో గ్రామ సర్పంచి కంచర్ల వాణి ఆధ్వర్యంలో గ్రామంలోని పేద మహిళలకు, వృద్ధులకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది నస్రీరాజన్ పాల్గొన్నారు.

12న నూజివీడు రానున్న చంద్రబాబు

ప్రజాశక్తి - నూజివీడు

పాఠశాలలకు వెళ్లే విద్యార్థి నుంచి పెన్షన్ తీసుకునే వృద్ధుల వరకు జగన్ సర్కారులో ఏ ఒక్కరూ సంతృప్తిగా లేరని టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అన్నారు. ఈ నెల 12వ తేదీన టిడిపి అధినేత చంద్రబాబునాయుడు నూజివీడు పర్యటనకు సంబంధించి సన్నాహక కార్యక్రమాలపై నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అధ్యక్షతన నియోజకవర్గ ముఖ్య నాయకులతో, కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయాలని కోరారు.

వైఎస్ఆర్ ఆసరా చెక్కు అందజేత

ప్రజాశక్తి - కైకలూరు

మహిళాభ్యున్నతికి సిఎం జగన్ కృషి చేస్తున్నారని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని ఆటపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో మూడో విడత వైఎస్ఆర్ ఆసరా పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కైకలూరు మండలంలో రూ.11.54 కోట్ల నమూనా చెక్కును మహిళలకు అందించారు. అనంతరం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ముదినేపల్లిలో మజ్జిగ పంపిణీ

ముదినేపల్లి : అయ్యప్పస్వామి జన్మదినం సందర్భంగా ముదినేపల్లి అయ్యప్పస్వామి సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక వైకుంఠం వద్ద అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహానికి అభిషేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అయ్యప్పస్వామి ముదినేపల్లి సేవా సమితి అధ్యక్షులు వి.నానాజీ, సేవా సమితి సభ్యులు ద్విచక్రవాహనదారులకు, బాటసారులకు మజ్జిగ అందించారు.

'జగనన్నే మా భవిష్యత్' వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - కైకలూరు

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల ఏడో తేదీ నుంచి 20వ తేదీ వరకు వైసిపి ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు నాయకులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ మాదు శివరామకృష్ణ, నియోజకవర్గ ఇతర ప్రజాప్రతినిధులతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

బుట్టాయగూడెం : స్థానిక సొసైటీ కళ్యాణ మండపంలో జగనన్నే మా భవిష్యత్ పోస్టర్‌ను ఎంఎల్ఎ బాలరాజు బుధవారం ఆవిష్క్రఇంచారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం శాంతి, జెడ్‌పిటిసి సభ్యులు మొడియం రామతులసి, వైస్ ఎంపిపి కుక్కల వరలక్ష్మి, జి.మోహన్‌రావు పాల్గొన్నారు.

'సమస్యలను పరిష్కరించని ఎంఎల్ఎ'

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం గ్రామ పంచాయతీలో దీర్ఘకాల సమస్యలను పరిష్కరించని ఎంఎల్ఎ గ్రామంలోకి ఎలా అడుగు పెడతారని పోలవరం గ్రామపంచాయతీ మాజీ వైస్ ప్రెసిడెంట్ మంగిన కొండ ప్రశ్నించారు. పోలవరంలో ఆయన నివాసం వద్ద బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం గ్రామంలో దీర్ఘకాలికంగా ఎన్నో సమస్యలు ఉన్నాయన్నారు. పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు గ్రామంలో పర్యటించిన ప్రతిసారి సమస్యలపై వినతిపత్రాలు ఇస్తూనే ఉన్నామన్నారు. స్థానిక సమస్యలు శాశ్వతంగా యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలన్నారు.

టిడిపితోనే అభివృద్ధి : బొరగం శ్రీనివాస్

టి.నరసాపురం : టిడిపితోనే రాష్ట్రం అబివృద్ధి చెందుతుందని టిడిపి పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఎపిగుంట గ్రామంలో బుధవారం ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని టిడిపి మండల అధ్యక్షులు నాయుడు రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు.

నేరాలు - ఘోరాలు

వివాహేతర సంబంధం నేపథ్యంలో వ్యక్తి హత్య

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

వివాహేతరం సంబంధం నేపథ్యంలో ఓ వ్యక్తి హత్యకు గురైన సంఘటన మండల పరిధిలోని ఈదర గ్రామంలోని మామిడితోటలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఎస్.చంటిబాబు తెలిపిన వివరాల ప్రకారం... బొద్దనపల్లి గ్రామానికి చెందిన గోళ్ల కోటేశ్వరరావు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కోటేశ్వరరావు ఈదర గ్రామంలోని మామిడితోటలో కోళ్ల పెంపకం పెట్టుకొని అక్కడే ఉంటున్నాడు. ఈ క్రమంలో సీతారామపురం గ్రామానికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. కోటేశ్వరరావు వల్ల ఆ మహిళకు తన రెండో భర్తతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో వారిద్దరు కలిసి ఈదరలోని మామిడితోటలో కోటేశ్వరరావును బుధవారం తెల్లవారుజామున మారణాయుధంతో దాడి చేసి హత్య చేశారు. కోటేశ్వరరావు తల్లి గోళ్ల రంగమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నూజివీడు రూరల్ సిఐ ఆర్.అంకబాబు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళా కూలీ మృతి

కలిదిండి : చేపల పట్టుబడికి కూలీలతో వెళుతున్న బొలెరో వ్యాన్‌ను లారీ ఢీ కొట్టిన ఘనటలో మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కలిదిండి దేవునితోటకాలనీకి చెందిన రామనబోయిన లక్ష్మి (40) మరో ఆరుగురి బొలెరో వ్యాన్‌లో చేపల పట్టుబడికి బయలుదేరారు. ఈ క్రమంలో మండలంలోని కోరుకొల్లు శివారు మందబయలు సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ బొలెరో వ్యాన్‌ను ఢీకొట్టడంతో వ్యాన్ పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మి తలకు తీవ్ర గాయామై అక్కడికక్కడే మృతి చెందింది. మరో ముగ్గురు కూలీలకు గాయాలపాలయ్యారు. వారిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మూడేళ్ల క్రితం లక్ష్మి భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. లక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మణికుమార్ తెలిపారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలోని పలు గ్రామాల్లో మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా భీమడోలు గ్రామపంచాయతీ వద్ద నిర్వహించిన కార్యక్రమానికి భీమడోలు మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు పి.సునీతమాన్‌సింగ్, పొలసానిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమానికి గ్రామసర్పంచి షేక్ రహీమా బేగం హుసేన ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ప్రముఖులు డాక్టర్ మాన్సింగ్, తుమ్మగుంట రంగ, రామకుర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలోని చేవూరులో ఉన్న బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని పెదపాలపర్రు, ముదినేపల్లిలో టిడిపి ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు జరిగాయి. పెనుమల్లిలోని సియోను కాలనీలో, ముదినేపల్లిలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శేవా నాగజగన్‌బాబూరావు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి స్వీట్లు పంచారు.

ముసునూరు : మండలంలోని కాట్రేనిపాడులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి అమరావతి జెఎసి కన్వీనర్ కొలుకపూడి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సుహాసని మోహనరావు, రాపర్ల బాలకృష్ణ, సూర్యదేవర నాగమంజుల, శ్రీనివాసరావు, సొంగా ఇస్సాక్, రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ రఘుబాబు, పార్టీ మండల అధ్యక్షులు దేవినేని డలరామ్, కొల్లి గంగారామ్, మందలపు ధర్మారాజు, గారపాటి నరసింహరావు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి తహశీల్దార్ ఎస్-ఎస్.శాంతి పూలమాల వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ గంగరాజు, విఆర్ఒ లు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక అరుంధతి కాలనీలో గల బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహానికి పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పూలమాల వేసి నివాళులర్పించారు.

పోలవరం : జగ్జీవన్‌రామ్ అణగారిన వర్గాల అభ్యున్నతికి పోరాడిన యోధుడు, కుల రహిత సమాజం కోసం కృషి చేశారని టిడిపి మండల అధ్యక్షుడు బొడ్డు కృష్ణ అన్నారు. పోలవరం పంచాయతీ వద్ద ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎంఆర్‌పిఎస్ సభ్యులు ఉండ్రాజవరపు వెంకటరమణమూర్తి, పోలవరం ఎస్ఐ పవన్‌కుమార్, టిడిపి మండల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉండ్రాజవరపు వెంకటరమణమూర్తి, టిడిపి నాయకులు పోలవరం ప్రభుత్వ హాస్పటల్ రోగులకు పండ్లు అందించారు.

నూజివీడు : సంఘసంస్కర్తగా ఉప ప్రధానిగా బాబు జగ్జీవన్‌రావు చేసిన సేవలు సర్వత్రా ఆచరణీయమని టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కొనియాడారు. నూజివీడు నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు.

టి.నరసాపురం : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ మాజీ ఉప ప్రధాని బాబూజగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను మండలంలోని టి.నరసాపురం, కేతవరం, బంధంచర్ల, అప్పలరాజుగూడెం గ్రామాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రామాల్లో ర్యాలీ ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో కె.జగ్గవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శి తనగాల వీరవెంకయ్య, రాజుపోతేపల్లి ఎంపిటిసి సభ్యులు బొడ్డపాటి రాంబాబు, సొదిమళ్ల నాగేశ్వరరావు, రవిబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

చాట్రాయి : మండలంలోని చిన్నంపేట గ్రామంలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం మాట్లాడారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జి.సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో జజ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తుమ్మగూడెంలో ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

జీలుగుమిల్లి : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ పాటు పడ్డారని ఎంపిటిసి సభ్యులు నాలి శ్రీను అన్నారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ బడుగు బలహీన వర్గాలకు ఎనలేని కృషి చేసిన గొప్ప నాయకుడు అని కొనియాడారు. దర్భగూడెంలో బాబూ జగ్జీవన్‌రామ్ యూత్ అధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు ఈ సందర్భంగా ఎండాకాలం దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి జగ్గారావు, కలపాల రాము, బాలస్వామి, కె.ప్రకాశం, దాసరి రవి, ఆదూరి రాంబాబు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎం.ఉదయభాస్కరరావు, ఆగిరిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచి సిహెచ్.లక్ష్మీవిక్టం బాబు, మానవ హక్కులకై పోరాడు-సాధించు ఉద్యమ సంస్థ అధ్యక్షులు ఎ.సురేష్‌బాబు, వైసిపి మండల అధ్యక్షులు పి.నరసింహరావు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జంగారెడ్డిగూడెం : స్థానిక ఏలూరు రోడ్డులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం జగ్జీవన్‌రామ్ కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు మెహబుబా, గోపి, కార్యకర్తలు నారాయణ యశ్వంత్, మణి, బి.ఆశీర్వాదం, నాని, సత్తిబాబు పాల్గొన్నారు. స్థానిక ఎంఎల్ఎ ఎలిజా క్యాంపు కార్యాలయంలో జయంతి కార్యక్రమం నిర్వహించారు. చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి, వైసిపి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. టిడిపి, కాంగ్రెస్, జనసేన ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

పెరుగుతున్న గృహ నిర్మాణ సామగ్రి ధరలకు అనుగుణంగా జగనన్న గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించి లబ్ధిదారులను ఆదుకోవాలని, శిథిలావస్థకు చేరుకున్న టిడ్కో గృహాలు లబ్ధిదారులకు తక్షణం అందించాలని పలువురు డిమాండ్ చేశారు. స్థానిక సిపిఐ కార్యాలయం స్ఫూర్తి భవనంలో సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షతన బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్పొరేషన్, మున్సిపాలిటీ, పట్టణ, మండల ప్రాంతాల్లో ప్రచార జాతయాత్రలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉగాది నాటికి జగనన్న కాలనీ ఇల్లు గృహప్రవేశాలు కల్పించి లబ్ధిదారులకు అందిస్తామని వాగ్దానం చేసిన ప్రభుత్వం విఫలం చెందిందని విమర్శించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య, ఎఐటియుసి నాయకులు పుప్పాల కన్నబాబు, మహిళా సమాఖ్య జిల్లా కోశాధికారి మావూరి విజయ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పొటేలు పెంటయ్య, సిపిఐ కార్యకర్తలు బళ్ల కనకదుర్గారావు, రెడ్డి శ్రీనివాస్ డాంగే, గేదెల నాగేశ్వరరావు, యర్రా వెంకటేశ్వర్లు, కనకం జగన్, బుగ్గల ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ నుండి దండు బోయిన చంద్రశేఖర్ పాల్గొన్నారు.



రౌండ్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలోని పొలసానిపల్లి గ్రామంలో తాగునీటి సరఫరా సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం హుసేన తెలిపారు. ఈ మేరకు అవసరమైన నిధుల మంజూరుకు సహకరించిన ఎంఎల్ఎ వాసుబాబుకు, గ్రామ పంచాయతీ పాలకమండలికి సర్పంచి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ భీమడోలు-ద్వారకాతిరుమల ఆర్‌అండ్‌బి రోడ్డు గ్రామం మధ్యగా వెళ్తుందన్నారు. దశాబ్ద కాలానికి పూర్వం నుంచే రోడ్డుకు రెండు వైపులా గ్రామం విస్తరించి ఉందన్నారు. గ్రామానికి రెండు వైపులా తాగునీరు అందించినందుకు పైపులైన్ రోడ్డు కిందుగా ఏర్పాటు చేశారన్నారు. ఆ తర్వాత క్రమంలో గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని రూ.50 కోట్ల వ్యయంతో ఆర్‌అండ్‌బి శాఖ రోడ్డును విస్తరించడంతో పాటు రోడ్డును అభివృద్ధి చేశారన్నారు. ఈ నేపథ్యంలో తాగునీటి పైపులైను రోడ్డు మధ్యగా వచ్చిందన్నారు. దీంతో పైపులైన్ మరమ్మతుకు కాని, పైపులైన్ ద్వారా నూతన కనెక్షన్లను ఇచ్చేందుకు అవకాశం లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. తాను సర్పంచి ఎన్నికల సందర్భంగా గ్రామస్తులకు ఇబ్బందులు లేకుండా తాగునీటిని అందించేందుకు నూతన పైపులైన్ ఏర్పాటుకు హామీ ఇచ్చానన్నారు. ఈ క్రమంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు గ్రామానికి వచ్చిన ఎంఎల్ఎ దృష్టికి సమస్యను తీసుకువెళ్లామని తెలిపారు. దీనిపై స్పందించిన ఎంఎల్ఎ నూతన పైపులైన్ ఏర్పాటుకు రూ.20 లక్షల జల జీవన్ మిషన్ నిధులను కేటాయించారన్నారు. వీటితో యుద్ధ ప్రాతిపదికన రహదారికి రెండు వైపులా నీటి సరఫరాకు అంతరాయం లేని విధంగా నూతన పైపులైను ఏర్పాటు చేశామన్నారు. దీనికోసం కొద్ది మేరకు అవసరమైన నిధులను గ్రామపంచాయతీ నుంచి సమకూర్చామన్నారు. ప్రధాన మురుగునీటి కాలువల పూడికతీత, ప్రక్షాళన కార్యక్రమాలను చేపట్టామని సర్పంచి వివరించారు.



పైపులైన్ పనులు పరిశీలిస్తున్న సర్పంచి

'వికాస్ విద్యాసంస్థలపై కక్షసాధింపు సరికాదు'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలో దినదినాభివృద్ధి చెందుతూ ప్రజాభిమానం పొందుతున్న వికాస్ విద్యాసంస్థలపై కొందరు కక్షపూరితంగా దాడులను ప్రోత్సహిస్తున్నారని వికాస్ విద్యాసంస్థల ఛైర్మన్ ఊరకరణం జగన్నాధరావు ఆరోపించారు. స్థానిక వికాస్ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల తాము అద్దెకు తీసుకున్న ఇంటి యజమాని ఉద్దేశ పూర్వకంగా దాడి చేయడం భయాందోళన కలిగించిందని తెలిపారు. ప్రధాన రహదారిపై కారులో వస్తున్న తనపై పాఠశాల డీన్ కె.సత్యనారాయణపై ఆకస్మిక దాడి చేశారని తెలిపారు. నడిరోడ్డుపై సుమారు 20 మందితో మూకుమ్మడి దాడితో హత్యాయత్నం చేస్తుండగా స్థానిక ఎస్ఐ సాగర్‌బాబు పోలీస్‌సిబ్బందితో అడ్డుకున్నారని తెలిపారు. తమ విద్యాసంస్థల విద్యార్థులకు నీట్ కోసం ప్రత్యేక శిక్షణ కల్పించేందుకు రాజమండ్రి నుంచి వచ్చిన మహిళా అధ్యాపకురాలిపై రాత్రి సమయంలో దాడికి పాల్పడ్డారన్నారు. ఆమెను దుర్భాషలతో మానసిక హింసకు గురి చేసిన పులకందం మోహనరావు, శ్రీనివాసరావు, భాస్కరరావు, తాతాజీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. పాఠశాల భవనం వద్ద విద్యార్థులు, సిబ్బందిపై దౌర్జన్యం కనపరచి దాడి చేసిన కొనకళ్ల రాంబాబు, నాగేశ్వరగుప్తలపై చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించి తమకు, సిబ్బందికి ప్రాణ రక్షణ కల్పించాలని కోరారు. తమ వద్ద ఆధారాలను పరిశీలించాలని సమస్యలను చట్టపరంగా సామరస్యంగా పరిష్కరించుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

అప్పు ఇవ్వలేదనే హత్య..!

కుటుంబంపై దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెం గ్రామానికి చెందిన తోణం శివను హత్య చేసి, అతని భార్య, కుమారునిపై దాడి చేసిన నిందితుడిని పోలీసలు అరెస్టు చేశారు. ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. వేగవరం గ్రామానికి చెందిన కొప్పర్తి రామకృష్ణ తాపీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెం గ్రామానికి చెందిన తోణం శివ పామాయిల్ గెలలు నరికే పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వీరిద్దరు అప్పుడప్పుడు మద్యం సేవిస్తుంటారు. రామకృష్ణ శివ ఇంటికి వెళ్తుండేవాడు. ఈ క్రమంలో రామకృష్ణ స్నేహితుడు బాలాజీకి రూ.11 వేలు అవసరమైంది. తన మోటార్‌సైకిల్‌ను తాకట్టు పెట్టి సొమ్ము ఇప్పించాలని రామకృష్ణను అడిగాడు. దీంతో రామకృష్ణ బైక్‌ను రూ.13 వేలకు తాకట్టు పెట్టి రూ.11 వేలు మాత్రమే బాలాజీకి ఇచ్చి మిగిలిన రూ.రెండు వేలు తాను వాడుకున్నాడు. ఈ నెల ఒకటో తేదీన బాలాజీ తన మోటారుసైకిల్‌ను తాకట్టు నుంచి విడిపించుకునేందుకు వడ్డీతో కలిపి రూ.12 వేలు రామకృష్ణకు ఇచ్చాడు. కాని రామకృష్ణకు వాడుకున్న రూ.రెండు వేలు సమకూరలేదు. దీంతో రామకృష్ణ అదేరోజు రాత్రి 9.30 గంటలకు మైసన్నగూడెం గ్రామంలోని తోణం శివ వద్దకు వచ్చి రూ.రెండు వేలు ఇవ్వాలని కోరగా అతను నిరాకరించాడు. ఇద్దరూ పొగాకు బ్యారన్ వద్ద ఉండగా శివకు బాకీ ఉన్న ఇద్దరు రైతులు రూ.15 వేలు నగదును ఇచ్చారు. శివ వద్ద డబ్బు ఉందని తెలిసిన రామకృష్ణ అతనితో మద్యం తాగుతూ ఉండిపోయాడు. ఇద్దరూ కలిసి మధ్యలో మృతుడు శివ ఇంటికి వెళ్లి మంచినీరు తెచ్చుకుని మళ్లీ బ్యారన్ వద్దకు వచ్చారు. తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో శివ బ్యారన్ వద్ద చెక్కబడ్డీపై పడుకుని ఉన్నాడు. ఇదే అదునుగా భావించిన రామకృష్ణ ఇనుపరాడ్డుతో శివను కొట్టి అతని సెల్‌ఫోన్, రూ.15 వేలు నగదు తీసుకున్నాడు. శివ భార్య తనను చూడటంతో సాక్ష్యం చెబుతుందనే కారణంతో ఇంటికి వెళ్లి శివ భార్య చిన్నిని రాడ్డుతో కొట్టి మెడలో బంగారు పుస్తెల తాడు, చెవిదిద్దులు లాక్కుని శివ కుమారుడిని సైతం రాడ్డుతో బలంగా కొట్టి పారిపోయాడు. కేసును దర్యాప్తు చేపట్టిన జంగారెడ్డిగూడెం పోలీసులు నిందితుడు రామకృష్ణను అరెస్టు చేశారు. ఈ కేసు చేధించడంలో ప్రతిభ చూపిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.